సాక్షి ఒడిశా

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,22,623లు, బంగారం 6.63 గ్రాములు, వెండి 10.46 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



హోమం.. ఆవాహనం

- 8లో



మనసు దోచుకున్న.. మానస్

- 8లో

న్యూస్‌రీల్

సాదాసీదాగా..



మెయిన్ రోడ్డుపై కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంపీ దంపతులు

కొరాపుట్: సాధారణ జీవితానికి ఇష్టపడే కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క కొరాపుట్ జిల్లా కేంద్రంలో కుటుంబంతో విహరించారు. తన ఇద్దరు చిన్నారులతో కలసి సతీసమేతంగా కాలినడకన కలియతిరిగారు. చందన్ పొఖిరి వద్ద కూరగాయలు కొనుగోలు చేశారు. అనంతరం అక్కడే ఉన్న బోటులో రైడింగ్ చేశారు. అలాగే పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి ప్రజలతో సంభాషించారు.

యువతి మృతిపై ఆందోళన



మృతదేహంతో ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గుమ్మక పంచాయతీ కార్యాలయం వద్ద యువతి మృతదేహంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గుమ్మక పంచాయతీ పేడకొండ గ్రామానికి చెందిన దేవె పొడియామి(20)కి కొద్ది రోజుల క్రితం ఆరోగ్యం బాగోలేక పోవడంతో కుటుంబ సభ్యులు కలిమెల ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. అక్కడ పరిస్థితి మెరుగవ్వక పోవడంతో వారం క్రితం మల్కన్‌గిరికి, అక్కడిక నుంచి కొరాపుట్ కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించిన గ్రామస్తులు గుమ్మక పంచాయతీ కార్యలయం ఎదుట బైఠాయించారు. దేవె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్కన్‌గిరి అభివృద్ధి పరిషత్ అధ్యక్షుడు అడ్మర్వా ఆందోళనకారులతో చర్చించి, విరమింపజేవారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో స్థానికులు, పోలీసులు

జయపురం: విజయవాడ–రాంచీ 326 జాతీయ కారిడార్ మార్గం బొయిపరిగుడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పట్టణానికి చెందిన జగన్ హరిజన్ బైక్‌పై బొయిపరిగుడ వెళ్లి తిరిగి వస్తుండగా హల్దిమరిఖగుడ గ్రామం నుంచి ప్రహ్లాద టక్రి, భీష్మ దొరాపుటియ బైక్‌పై ఎదురుగా వస్తూ భీరకంబ కూడలి వద్ద పరస్పరం ఢీకొన్నారు. దీంతో ముగ్గురూ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో జగన్ పరిస్థితి విషమంగా ఉండటంతో బొయపరిగుడ, అక్కడి నుంచి జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి, వాహనాలను సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్



దొంగతనం కేసులో పట్టుబడిన నిందితులు

జయపురం: పట్టణంలోని గౌడవీధి ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఫర్నీచర్ దొంగతనం కేసులో ఇద్దరు నిందితులతో పాటు వాటిని కొనుగోలు చేసిన వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితులు గోపబంధునగర్ పద్మన మచ్చ(23), టి.రాజు(21), ప్రసాదరావుపేట కవాడివాలాకు చెందిన కె.సత్యారావు(64)గా గుర్తించామని ఐఐసీ అధికారి ఈశ్వర తండి తెలిపారు. చోరీ సొత్తులో మోటారు పంపు, రెండు ఇనుప కిటికీలు, చెక్క సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు.

కుట్రపూరితంగానే..
కొటియాపై నిర్లక్ష్యం!



రాష్ట్రశాఖ కార్యాలయంలో కొటియా ఫొటోలను పదర్శిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

- మరోసారి తెరపైకి ఉభయ రాష్ట్రాల సరిహద్దు వివాదం
- రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ ఎమ్మెల్యేలు
- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సూచనలు పట్టించుకోక పోవడంపై విమర్శలు
- ఉద్దేశ పూర్వకంగానే ఆంధ్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నారంటూ వ్యాఖ్యలు

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు కొరాపుట్ జిల్లా కొటియా గ్రామాల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రప్రభుత్వం చర్యలపై ప్రధాన ప్రతిపక్షం భారతీయ జనతాపార్టీ విరుచుకు పడింది. ఈ మేరకు భువనేశ్వర్‌లోని పార్టీ రాష్ట్రశాఖ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేలు సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇందులో బ్రహ్మగిరి ఎమ్మెల్యే లలితేందు బిద్యాధర మహాపాత్రొ, లొయిసింగ ఎమ్మెల్యే ముకేష్ మహాలింగ్, బొడొసాహి ఎమ్మెల్యే సనాతన్ బిజులి, ధామ్‌నగర్ ఎమ్మెల్యే సూర్యవంశీ సూరజ్ మాట్లాడారు. వీరంతా ఇటీవల ముగిసిన ఉత్కళ దివస్ సందర్భంగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి కొటియా ప్రాంతాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... 1959 నుంచి కొటియా గ్రామాల్లో బందోబస్తు ప్రక్రియ నోచుకోలేదని తెలిపారు. సామరస్య ఒప్పందంతో సరిహద్దు గ్రామాల వివాదం పరిష్కరించాలని 2021 ఆగస్టు 31న సుప్రీంకోర్టు సూచించిందని గుర్తుచేశారు. 2021 నవంబర్ 8న ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భువనేశ్వర్‌లో భేటీ అయ్యారన్నారు. ఈ భేటీ ఫలప్రదమైనట్లు ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రకటించారని, ఉన్నతస్థాయి సంయుక్త కమిటీ వివాదస్పద 21 కొటియా రెవెన్యూ గ్రామాల వివాదాన్ని పరిష్కరిస్తుందని వెల్లడించారన్నారు. అయితే దాదాపు ఏడాదిన్నర పూర్తి అవుతున్నా ఎటువంటి చర్యల దాఖలాలు లేవని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో లోపాయికారీ ఒప్పందంతో కొటియా గ్రామాలను అప్పగించేందుకు కుట్రపూరిత వ్యూహం రూపొందుతోందని ఈ వర్గం ఆరోపించింది.

అధికారుల మౌన వైఖరి..

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కొటియా ప్రాంతం సందర్శన పురస్కరించుకుని రాష్ట్ర ప్రజల స్వార్థ ప్రయోజనాల పరిరక్షణ నేపథ్యంలో ఇచ్చిన పిలుపు పట్ల బీజేడీ నేతలు కల్లబొల్లి వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తంచేశారు. సరిహద్దు వివాదం పరిష్కారం కోరుతూ ధర్మేంద్ర ప్రధాన్ గతంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి, ముఖ్యమంత్రి నవీన్‌కు పలుమార్లు అభ్యర్థించారన్నారు. ఈ అభ్యర్థనలు ఆశాజనకంగా ఫలప్రదం కాకపోవడంపై విచారం వ్యక్తంచేశారు. వివాదం పరిష్కారం కోసం అఖిల పక్ష సమావేశానికి పలుమార్లు అభ్యర్థించినా పెడచెవిన పెట్టారని దుయ్యబట్టారు. దీనిని అదునుగా చేసుకొని, భౌగోళిక సరిహద్దులు అతిక్రమించిన పొరుగు రాష్ట్రం.. చర్చి, పాఠశాల, ఆవాస్‌యోజన ఇళ్లు, నీళ్ల ట్యాంకు, విద్యుత్ సరఫరా అనుబంధ కట్టడాలు యథేచ్ఛగా చేపడుతోందన్నారు. ఈ చర్యలను అడ్డుకోవడంలో రాష్ట్రప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని ఆక్షేపించారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజినల్ కమిషనర్(ఆర్‌డీసీ) మౌన వైఖరి సందేహాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన 5టీ కార్యాచరణ పరిధిలో కొటియా ప్రాంతాన్ని అనుసంధానం జోడించక పోవడం పలు సందిగ్ధ పరిస్థితుల్ని ప్రేరేపిస్తుందని ఆరోపించారు.

తెలుగు భాషతో పోకడ..

ఉత్కళ రాష్ట్రం ఆవిర్భవించి 87 ఏళ్లు పూర్తయ్యాయని.. అయితే రాష్ట్రంలోని కొటియా ప్రాంతంలో మాత్రం తెలుగు భాష అత్యధిక ప్రాచుర్యంలో తారసపడటం విచారకరమని బీజేపీ ఎమ్మెల్యే అసహనం వ్యక్తంచేశారు. పోస్టర్లు, కటౌట్లు, ఫలకాలపై ఒడియా భాష కనుమరుగై, పొరుగు భాష తళుక్కుమంటోందన్నారు.

ఈ ప్రాంతంలో మైలురాళ్లపై చెరోవైపు తెలుగు, ఒడియా భాషల్లో సూచన జారీ చేయడం అత్యంత విడ్డూరంగా పేర్కొన్నారు. కొటియా ప్రాంతంలో ట్రాన్సుఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కంటి తుడుపు వైఖరి మాత్రమేనని.. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరఫరా చేస్తున్న విద్యుత్‌తో చలామణి అవుతున్నారని ఆక్షేపించారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉండగా రోడ్లు, ఇతరేతర నిర్మాణ, నిర్వహణ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు వెచ్చించినట్లు ప్రకటించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు.





జయపురం: మాట్లాడుతున్న బీజేపీ నాయకులు గౌతమ సామంతరాయ్, బలభద్ర మాఝి

రాష్ట్ర ప్రభుత్వానికి సుముఖత లేదు..

జయపురం: వివాదాస్పద సరిహద్దు కొటియా గ్రామాల వివాద పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. జయపురంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బలభద్ర మాఝి, రాష్ట్ర పరిషత్ శాశ్వత సభ్యులు గౌతమ సామంతరాయ్ మాట్లాడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన కొటియా పర్యటనలో ఆంధ్రప్రదేశ్ పోలీసులను తరమికొట్టడం కొటియా–ఒడిశా స్వాభిమానమని అభివర్ణించారు. వాస్తవానికి ధర్మేంద్ర ప్రధాన్ కొటియా వివాదంపై 3సార్లు సీఎం నవీన్‌కు లేఖలు రాశారని, ఇప్పటి వరకు ఎటువంటి సమాధానం రాలేదని విమర్శించారు. ఈ వివాద పరిష్కారానికి కేంద్రప్రభుత్వం మధ్యవర్తిగా వ్యవహరించాలని ఆయన సూచించారని తెలిపారు. అయితే ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ముందుకు రాలేదని, ఉద్దేశ పూర్తకంగానే ఈ జాప్యం జరుగుతోందని దుయ్యబట్టారు.

జపాన్‌కు సీఎం నవీన్ పయనం



- రాష్ట్రాలను పెట్టుబడిదారులను ఆకర్షించడమే లక్ష్యం
- వెంట వెళ్లిన మంత్రి ప్రతాప్‌కేశరి, ఉన్నతాధికారులు

భువనేశ్వర్: దేశంలోని ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా నిలవడానికి నిరంతర ప్రయత్నంలో.. ఒడిశాలో పెట్టుబడి అవకాశాలను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యేక బృందంతో జపాను పయనమయ్యారు. ముందుగా ఢిల్లీ చేరుకున్న ఆయన.. అక్కడి నుంచి ప్రతినిధి బృందంతో కలిసి సోమవారం ఉదయం టోక్యోకు బయల్దేరింది. వారం రోజుల పాటు ఆ దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. జపాన్‌తో సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రతినిధి బృందం నిబద్ధతను బలపరుస్తుంది. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రం అత్యంత అనుకూలమైన ప్రాంతంగా వివరించే దిశలో అనుబంధ వర్గాలతో చర్చలు, సమావేశాలతో సంప్రదింపులు చేపడుతుంది. పర్యావరణ పర్యటన, బౌద్ధ పవిత్ర క్షేత్రాల విశిష్టత, క్రీడారంగంలో పురోగతి, క్రీడాకారులకు శిక్షణ తదితర కీలక అంశాలతో క్యోటో ప్రాంతంలో రౌండ్ టేబుల్ సదస్సులో ప్రతినిధి బృందం పాలుపంచుకుంటుంది. ప్రతినిధి బృందంలో పరిశ్రమలు, సూక్ష్మ, లఘు, మధ్య తరహా వ్యాపారశాఖ, విద్యుత్‌శాఖ మంత్రి ప్రతాప్‌కేశరి దేవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, సీఎం ప్రత్యేక కార్యదర్శి ఆర్.వి.సీల్‌కృష్ణ, 5టీ కార్యదర్శి వీకే పాండియన్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హేమంత్‌శర్మ, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మనోజ్ మిశ్రా, ఇపికాల్ మేనేజింగ్ డైరెక్టర్ భూపేందర్ పునియా ఉన్నారు.

పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ..

రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా వారం రోజుల జపాన్ పర్యటనకు ముఖ్యమంత్రి నవీన్ నడుం బిగించారు. ఈ మేరకు టోక్యో, క్యోటోలో సంభావ్య జపాన్ పెట్టుబడిదారులతో సమావేశం కానున్నారు. జపాన్ ఒడియా సంఘంతో పరస్పర సంబంధాలు, సాంకేతిక సమాచారం, పరిశ్రమలు, పర్యటన, క్రీడలపై దృష్టి సారిస్తారు. ఒడిశాకు పెట్టుబడులను ఆకర్షించడం, వ్యాపార అనుకూలమైన వాతావరణం, వివిధ రంగాలలో పెట్టుబడి సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ఆ దేశానికి చెందిన పారిశ్రామిక దిగ్గజాలు, పరిశ్రమల సంఘాలతో భేటీ జరగనుంది. అలాగే ఉక్కు, అల్యూమినియం, జౌళి, ఆహారం, సీఫుడ్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా రంగాలలో పెట్టుబడులకు సంబంధిత దిగ్గజాలకు వివరిస్తారు. ఈ సన్నాహాలతో జపాన్ వ్యాపార సంస్థలతో రాష్ట్ర సంబంధ బాంధవ్యాలు బలోపేత పరిచేందుకు సానుకూల అవకాశాలను అన్వేషిస్తుంది. ఈ పర్యటన పురస్కరించుకుని ఔత్సాహిక పెట్టుబడిదారులతో ముఖాముఖి సమావేశాలను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ఒడిశా బిజినెస్ మీట్ టోక్యో–2023, జపాన్–ఒడియా వర్గం ప్రజలతో ప్రతిస్పందన ప్రత్యేక శీర్షికలుగా ప్రస్తావిస్తుంది. ప్రతినిధి బృందం కిమిట్స్ స్టీల్ వర్క్స్, నిప్పన్ స్టీల్ కార్పొరేషన్ పరిశోధన–అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) వ్యవస్థను ప్రత్యక్షంగా సందర్శిస్తుంది. నైపుణ్యత అభివృద్ధి, ఉన్నతస్థాయి సాంకేతిక స్టార్టప్‌ల ఆవిష్కరణకు అనుకూలమైన వనరులను సమీక్షించడం ఈ సందర్శన ప్రత్యేక లక్ష్యంగా ప్రతినిధి బృందం పేర్కొంది.

సంప్రదాయ సంబురం




దేశిబెహరా వీధిలో సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్న బీఎంసీ యంత్రాంగం

- నేటి నుంచి మాబుడి శాంతమ్మ సంబరాలు
- పుట్టింటికి చేరుకున్న ఆడపడుచులు

బరంపురం: నగరంలో మంగళవారం(నేటి) అర్ధరాత్రి నుంచి ప్రారంభంకానున్న మాబుడి శాంతమ్మ సంబరాలకు శతాబ్దాల చరిత్ర ఉంది. దీనిని పరిశీలిస్తే.. ఇక్కడి ఆచార, వ్యవహారాలు దక్షిణాది సంప్రదాయాలకు అతి సమీపంగా కనిపిస్తాయి. ప్రతి రెండేళ్లకోసారి జరిగే సంబరాలు.. గతంలో దాదాపు 2నెలలు జరిగేవి. అధికారులు సూచనలతో ప్రస్తుతం 21రోజులకు కుదించారు. విడిపోయిన కుటుంబాలు ఈ సందర్భంగా అయినా కలుస్తుంటాయి. ఉద్యోగరీత్యా ఎంతదూరంలో ఉన్నా, సంబరాలకు మాత్రం హాజరవుతారు. సంబరాల ప్రారంభానికి ముందే వివాహమైన తమ కుమార్తెలను తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకువస్తారు. పూర్తయినంత వరకు అత్తవారింటికి పంపించరు. మహిళలు ప్రారంభం, ముగింపు సందర్భాల్లో వేలాదిగా ఘటయాత్రలో పాల్గొంటారు. అలాగే అమ్మవారికి జంతు బలులు, మాంసాహారం నిషేధం. సంబరాల సమయంలో పెళ్లిళ్లు నిర్వహించరు.

మొక్కుబడుల సమయంలో వివిధ వేషధారణలతో అమ్మవారిని ఆరాధిస్తూ తలనీలాలు, పసుపు, కుంకుమ గాజులు, చీర, బంగారం, వెండి కళ్లు, నగలు కానుకలుగా సమర్పిస్తారు. సంబరాలు జరుగుతున్నట్లు బంధుమిత్రులకు ముందుగా ఆహ్వాన లేఖలు అందించడంతో పాటు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేశారు. అలాగే ప్రతి ఇంట్లో పుట్టిన పిల్లలకు కనీసం మూడు సంబరాల్లు అయినా విధిగా వేషాలు వేయించి, అమ్మవారి దర్శనం చేయిస్తారు. ఆ తర్వాత కూడా కొందరు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తారు.




ప్రత్యేక అలంకారంలో పూజలు అందుకుంటున్న మాబుడి శాంతమ్మ

బాధ్యతలు స్వీకరించిన
బార్ నూతన సంఘం



జయపురం: ప్రమాణ స్వీకారానికి హాజరైన బార్ అసోసియేషన్ సభ్యులు



నవరంగ్‌పూర్‌లో నూతన కార్యవర్గం

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించింది. జిల్లా కేంద్రంలోని కోర్టుల సముదాయంలో ఎన్నికల అధికారి సీహెచ్ బాబా యుగంధర్(మురళీ) నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా నర్సింగ త్రిపాఠి, ఉపాధ్యక్షుడిగా హరినారాయణ బెహరా, కార్యదర్శిగా తపన్ సింగ్, సంయుక్త కార్యదర్శిగా అనీల్ దీనబంధు ఉన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు కిషోర్ పట్నాయక్, తాజ్‌ఇమ్రాన్ షరీఫ్ పాల్గొన్నారు.

జయపురంలో..

జయపురం: కొరాపుట్ జిల్లాలోని జయపురం కోర్టులో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలో విజయం సాధించిన నూతన అధ్యక్షుడు భీరేష్ పట్నాయక్, కార్యదర్శి శరత్ మాఝి, ఉపాధ్యక్షుడు సహదేవ్ పట్నాయక్, సహాయ కార్యదర్శి పి.సన్యాసిరావు, జాయింట్ కార్యదర్శి రాజేంద్ర మదల, కోశాధ్యక్షుడు గిరిధర ఖొరా, గ్రంథాలయ కార్యదర్శి సురేంద్రకుమార్ హడప, గ్రంథాలయ సహాయ కార్యదర్శి చందన నాయక్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి శౌశానంద మిశ్రా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

335కిలోల గంజాయి నిందితులు

బరంపురం: కొందమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలింపులు ఆగడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్‌కుమార్ సింగ్ ఆదేశాల మేరకు కొందమాల్–గంజాం జిల్లా సరిహద్దు కళింగా ఘాటీపై బల్లిగుడా పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో బైక్, వ్యానులో వస్తున్న దుండగులు పోలీసులను గమనించడంతో వాహనాలను విడిచి, పరారయ్యారు. వాటిని తనిఖీ చేయగా 335కిలోల గంజాయి పట్టుబడిందని ఏఎస్పీ సురేంద్రకుమార్ పాత్రొ తెలిపారు. ఈ మేరకు సరుకు, వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నామని వివరించారు.



పట్టుబడిన వాహనాలు, గంజాయి

జాదవ మాఝికి నివాళులు



జాదవ మాఝి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుమారులు ఎంపీ రమేష్, ఎమ్మెల్యే ప్రకాష్

కొరాపుట్: దివంగత మాజీమంత్రి జాదవ మాఝి వర్థంతి సందర్భంగా నవరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితిలోని అతని స్వగ్రామం దమనాహండిలో సోమవారం నివాళులర్పించారు. జాదవ కుమారులైన నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్‌చంద్ర మజ్జి తమ తండ్రి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. చందాహండి సమితి కేంద్రంలోని జాదవ మజ్జి ఉన్నత పాఠశాలలో 24వ వర్థంతి కార్యక్రమాలు జరిగాయి. పలువురు యువకులు హాజరై, రక్తదానం చేశారు. పేదలకు ఉచితంగా వస్త్రాలు,ఆహారం పంపిణీ చేసారు. కార్యక్రమాలలో రాష్ట్ర లిఫ్ట్ ఇరిగేషన్ సలహాదారుడు ప్రమోద్ పాఢి, జిల్లా పరిషత్ సభ్యులు, సమితి చైర్మన్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం కోర్టు ఆవరణలోని అసోసియేషన్ హాల్‌లో సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడుగా డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా పి.రాము, కార్యదర్శిగా ఎస్.చిన్నారావు, కోశాధికారిగా ఎ.ఎల్.నారాయణ, క్రీడల కార్యదర్శిగా జి.భాస్కరరావు, గ్రంథాలయ కార్యదర్శిగా ఎం.భవానీప్రసాద్, మహిళా ప్రతినిధిగా వి.హరిప్రియలు ప్రమాణ స్వీకరణ చేశారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించి కె.తిరుపతిరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బి.ఫాల్గుణరావు, శిష రమేష్, సీనియర్, జూనియర్, మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్టీసీ డీపీటీవో విజయ్‌కుమార్



విజయ్‌కుమార్, డీపీటీవో

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీపీటీవో ఎ.విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో డ్రైవింగ్ స్కూల్స్ నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా శ్రీకాకుళంలోని స్కూల్ కూడా బాగా నడుస్తోందన్నారు. ఇప్పటివరకు 11 బ్యాచ్‌లు శిక్షణను పూర్తి చేసుకున్నాయన్నారు. తదుపరి బ్యాచ్ ఈనెల రెండో వారంలో ప్రారంభమవుతోందని చెప్పారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు రాబోయే కాలంలో ఆర్టీసీతో పాటు ఇతర గవర్నమెంట్ శాఖల్లో కూడా ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. డ్రైవింగ్ శిక్షణ తీసుకోవాలనుకునే వారు 99630 91999, 73829 21920 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'న్యాయ పోరాటం ఫలించింది'



మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు, సినీ నిర్మాత ప్రకాశ్ తదితరులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆనుకుని ఉన్న జగద్ధాత్రి స్వర్ణకారుల సంఘం స్థలం హక్కు విషయంలో తమ న్యాయ పోరాటం ఫలించిందని ఆ సంఘం ప్రతినిధులు సాతివిల్లి అమ్మాజీరావు, కంచుమోజు మల్లేశ్వరరావు, లక్కోజు వితలేశ్వరరావు తదితరులు తెలిపారు. సంబంధిత స్థలం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 520/1లో 36 సెంట్లు, సర్వే నంబర్ 520/3లో 1.66 సెంట్లు స్థలాన్ని జగద్ధాత్రి స్వర్ణకారుల సొసైటీ పేరుతో 1966 సంవత్సరం నుంచి స్థలం తమ ఆధీనంలో ఉండేదని పేర్కొన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు ఈ భూమిని కాజేయాలని చూశారని.. ఇదే సమయంలో సినీ నిర్మాత బలగ ప్రకాశ్ అండగా నిలిచి తమ తరఫున న్యాయ పోరాటం చేశారని వివరించారు. ప్రకాశ్ సాయంతో హైకోర్టు ద్వారా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులు ప్రైవేట్ స్థలంగా నివేదిక ఇచ్చారని వారు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చలానాలు చెల్లించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకున్నామన్నారు. ప్రస్తుతం ఈ స్థలాన్ని 22-1ఈ పరిధి నుంచి మినహాయించాలని కోరారు. సమావేశంలో కొత్తపల్లి రాజేశ్వరితో పాటు సినీ నిర్మాత బలగ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. మరో వైపు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఈ స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు

మే1 నుంచి క్రీడాశిక్షణ శిబిరాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: వేసవి క్రీడా శిక్షణ శిబిరాల (సమ్మర్ కోచింగ్)కు సన్నాహాలు మొదలయ్యాయి. సమ్మర్ కోచింగ్ క్యాంపులను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ సౌజన్యంతో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో జిల్లాలో 50 కేంద్రాల వేదికగా మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు శిబిరాలను నిర్వహించనున్నారు. 16 ఏళ్లలోపు వయస్సు కలిగిన బాలబాలికలకు కోచింగ్ క్యాంప్‌లలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు సంబంధించిన వివరాలకు శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) కార్యాలయాన్ని సంప్రదించాలని డీఎస్‌ఏ సీఈఓ బీవీ ప్రసాదరావు సూచించారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.రవి (సెల్: 98660 98642)ని సంప్రదించాలన్నారు.

విన్నపాలు వినవలె..

- గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన వినతులు
- హాజరైన జిల్లా ఉన్నతాధికారులు

పర్లాకిమిడి: ప్రజా వినతుల స్వీకారానికి నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు అర్జీలు వెల్లువెత్తాయి. పర్లాకిమిడి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి రమాంచల్ ఖమారి, డీఎఫ్‌ఓ ఎస్.ఆనంద్ పాల్గొన్నారు. ఇందులో పర్లాకిమిడ మున్సిపాలిటీ, రాణిపేట, పాటికోట, కెరండి పంచాయతీల నుంచి 140 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగతం 123, గ్రామ సమస్యలు, పింఛన్ల మంజూరుపై 17 వచ్చాయి. 69 వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. కాశీనగర్ బ్లాక్, పర్లాకిమిడి పురపాలక పరిధిలోని పలువురు మహిళలకు మధుబాబు నెలవారి పింఛన్ బ్యాంకు లింకేజీ, బయోమెట్రి విధానంలో లోపం కారణంగా అందడం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ లెంక మధు, కాశీనగర్ సమతి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ వినతిపత్రం అందజేశారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ముగ్గురు పేదలకు రూ.17 వేల చెక్కును అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంల ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజినీర్లు, సీడీఎంఓ డాక్టర్ పీకే పాత్రొ, మున్సిపల్, ఎమర్జెన్సీ నోడల్ అధికారి నర్మదా నాయక్, డిప్యూటీ కలెక్టర్ నట్వర గరోడో, తహసీల్దార్ నారాయణ బెహరా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ..

రాయగడ: జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అధ్యక్షతన స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 49వినతులు రాగా.. ఇందులో ముగ్గురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాల ఏర్పాటుకు సంబంధించి రాజస్థాన్‌కు వెళ్లేందుకు రూ.10వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించారు. అలాగే పట్టణానికి సమీపంలోని అమలాభట్టలో నివసిస్తున్న 150 కుమ్మరి కుటుంబాలు తమ ప్రాంత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మట్టిని ఆధారంగా చేసుకుని జీవిస్తున్నామని, పని చేసుకునేందుకు అనుగుణంగా గ్రామంలో షెడ్ నిర్మించాలని కోరారు. అనంతరం సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సింగ్ ఆదేశాలు జారీచేశారు.



వీల్‌చైర్‌పై గ్రీవెన్స్‌కు వచ్చిన సెరంగో వర్కర్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాశీనగర్ బ్లాక్ అధ్యక్షురాలు శాయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ మధు



రాయగడ: సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లేందుకు వేచి ఉన్న ప్రజలు

మనసు దోచుకున్న.. మానస్

- స్పైడర్‌మ్యాన్ పాత్రధారి టామ్ హాలండ్ నుంచి ప్రశంసలు



మానససాహు ఆవిష్కరించిన శాండ్ యానిమేషన్



స్పైడర్‌మ్యాన్ పాత్రధారి టామ్ హాలండ్‌తో మానసకుమార్ సాహు

భువనేశ్వర్: అంతర్జాతీయ సైకత యానిమేషన్ కళాకారుడు మానస్‌కుమార్ సాహూ తన కళా ప్రదర్శనతో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులను ఆకట్టుకున్నారు. ముంబైలో జరిగిన నీతా-ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాండ్ యానిమేషన్‌లో తన నైపుణ్యాన్ని ప్రదర్శించి, ప్రపంచం నలుమూలల విచ్చేసిన ప్రముఖులను మంత్రముగ్ధం చేశారు. రాష్ట్ర సంస్కృతి, వారసత్వం ఆధారంగా ఇసుకతో ఇతివృత్తాలను వర్ణించి ఆవిష్కరించిన యానిమేషన్ అబ్బుర పరిచింది. ప్రఖ్యాత స్పైడర్‌మ్యాన్ పాత్రధారి, హాలీవుడ్ నటుడు టామ్‌హాలండ్, నటి జెండయా ఆయన కళా ప్రదర్శన పట్ల ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాండ్ యానిమేషన్‌పై టామ్ తన ఆటోగ్రాఫ్ ఇచ్చి, అబ్బుర పరిచాడు. నీతా ముఖేష్ అంబానీ సాంస్కృతిక కేంద్రంలో నాలుగు రోజుల జరిగిన ప్రదర్శనలో ఒడిశా పట్టా చిత్ర సమగ్ర పరిణామ క్రమం ఏకీకృత యానిమేన్స్‌లో ప్రదర్శించడం విశేషం.

గర్భిణికి చుక్కలు చూపించారు!

- టెక్కలి జిల్లా ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం
- '108' వాహనంలో ఆడ బిడ్డ జననం



108 వాహనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన దేవకీ నాయక్, ఆశాకార్యకర్త నిరుపమ, ఈఎంటీ జగదీశ్వరరావు

టెక్కలి రూరల్: వైద్యఆరోగ్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్‌స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో కొంతమంది సిబ్బంది వ్యవహారశైలి వైద్యశాఖకు మచ్చతెచ్చేలా ఉంటుంది. దీనికి టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చోటుచేసుకున్న ఘటనను ఉదాహరణగా చెప్పవచ్చు. ప్రసవ వేదనతో ఆశకార్త సాయంతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి టెక్కలి ఆస్పత్రి సిబ్బంది చుక్కలు చుపించారు. దీనికి సంబంధించి ఆశకార్యకర్త నిరుపమ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మందస మండలం హున్నాలి గ్రామానికి చెందిన గర్భిణి దేవకీనాయక్ పురిటినొప్పులతో హరిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అయితే అక్కడ వైద్య సిబ్బంది ఆమెను పరీక్షించి పరిస్థితి బాగోలేదని చెప్పి టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో దేవకీ నాయక్‌ను తీసుకుని ఆశవర్కర్ ఎం.నిరుపమ ఆదివారం అర్ధరాత్రి 12.45 గంటలకు టెక్కలి వచ్చారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులు గర్భిణిని బెడ్డుపై పడుకోబెడితే ప్రసవం చేస్తామని చెప్పారు. అయితే ఇంతలో ఓ హెడ్‌నర్సు అక్కడి వచ్చి ఎక్కడ నుంచి వచ్చారు? ఈ సమయంలో ఇక్కడకు ఎందుకు తెచ్చారు? ఇక్కడ వైద్యం చేయలేమని.. ఆమె పరిస్థితి బాగోలేదని, రక్తం కూడా సరిపోయినంత లేదని, బీపీ కూడా ఎక్కువ ఉందంటూ వైద్యం చేయకుండా ఇబ్బంది పెట్టినట్టు ఆశవర్కర్ చెప్పారు. ఎక్కడ నుంచి వచ్చారని అడగగా హరిపురం నుంచి అని చెప్పగా ఇలాంటి కేసులన్నీ పలాస, హరిపురం నుంచే వస్తాయని అనడంతో పాటు తిన్నగా శ్రీకాకుళం తీసుకొని వెళ్లిపోవాలని నోటికి వచ్చినట్లు తిట్టారని వాపోయింది. అర్ధరాత్రి 1.45 గంటలకు అక్కడ నుంచి శ్రీకాకుళం రిఫర్ చేయడంతో ఏడ్చుకుంటూ 108 వాహనంలో శ్రీకాకుళం బయలుదేరినట్టు వివరించారు.

ఆడబిడ్డకు జననం

తాము పడుతున్న బాధను చూసి 108 సిబ్బంది ధైర్యం చెప్పారని ఆశవర్కర్ తెలిపారు. నరసన్నపేట దాటే సరికి ప్రసవ నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ జగదీశ్వరరావు సాయంతో సపర్యలు చేయగా దేవాకి నాయక్ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను రిమ్స్‌లో చేర్పినట్టు చెప్పారు. ఈ విషయాన్ని టెక్కలి ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు వద్ద ప్రస్తావించగా ఆదివారం అర్ధరాత్రి గర్భిణి రావడం వాస్తవమేనన్నారు. అయితే ఇంత విషయం జరిగినట్లు తన దృష్టికి రాలేదని చెప్పారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం



మండలంలోని నిమ్మాడలో ఆదివారం వంశధార కాలువలో ప్రమాదవశాత్తు మునిగి కాలెపు నాగరాజు, కుమారుడు తులసీరాజుతో పాటు నాగరాజు స్నేహితుడు వెంకటరమణ చనిపోయారు. కుమారుడి ప్రాణాలు కాపాడేందుకు నాగరాజు కాలువలోకి దూకగా.. స్నేహితుడిని, అతడి కొడుకును రక్షించేందుకు వెంకటరమణ నీటిలోకి దిగారు. కానీ దురదృష్టవశాత్తూ ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలు బయటకు తీస్తున్న సమయంలో నాగరాజు, వెంకటరమణ ఒకరి చేతిని మరొకరు గట్టిగా పట్టుకుని ఉండడం కనిపించింది. ఎప్పటి నుంచో స్నేహితులుగా ఉన్న వీరు మరణంలోనూ కలిసే ఉండడం చూపరులను కంట తడి పెట్టించింది. నాగరాజు స్వస్థలం పైడిభీమవరం కాగా, నిమ్మాడలోని అత్తవారింట్లో ఉంటున్నారు. వెంకటరమణ స్వస్థలం మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేట, ఈయన భార్య గతంలో చనిపోగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాలకు సోమవారం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశామని ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలి తెలిపారు.

– కోటబొమ్మాళి

ఆరోగ్యశ్రీ బుక్‌లెట్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఉన్న ఆరోగ్య మిత్రలకు, సచివాలయ ఏఎన్‌ఎంలకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్య సేవల నూతన వివరాలు, విధానాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు రూపొందించిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రైనింగ్ మాన్యువల్ బుక్‌లెట్లను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆవిష్కరించారు. జిల్లాలో సచివాలయం ఏఎన్‌ఎంలకు, ఆరోగ్య మిత్రలకు ఈ బుక్లెట్లను ఆరోగ్యశ్రీ టీం లీడర్ల ద్వారా అందజేస్తామన్నారు. వివరాలను నిశితంగా గమనించి ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఆందోళన విస్తృతానికి సిద్ధం



మాట్లాడుతున్న ప్రమోద్ మహంతి

జయపురం: జయపురం గగణాపూర్‌లోని సేవా పేపరు మిల్లు విశ్రాంత శ్రామికులు, మరణించిన వారి కుటుంబాలు తమ డిమాండ్ల సాధనకు ఆందోళన విస్తృతం చేసేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వారంతా సమావేశమై, భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీ ముందు నిర్వహించిన ధర్నా, సీఎం, పరిశ్రమల మంత్రి, విభాగాల కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు. సేవాపేపరు మిల్లు పరిస్థితిపై చర్చించేందుకు ఈనెల 12న రావాల్సిందిగా పరిశ్రమల మంత్రి ఆహ్వానించారని తెలియజేశారు. అలాగే బడ్జెట్ సమావేశాల్లో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ పేపరుమిల్లు సమస్యను ప్రస్తావించారని, శ్రామికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారన్నారు.

ఏపీపీఎస్సీ గ్రేడ్-4 పరీక్ష నేడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజేశ్వరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్(గ్రేడ్-4) తుది పరీక్ష మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె చాంబరులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర కలశాలలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ (గ్రేడ్ - 4) తుది పరీక్ష జరగనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా జరిగే ఈ పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆమె వివరించారు.

24 నుంచి వేసవి తరగతులు

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 24 నుంచి జూన్ 10 వరకు వేసవి శిక్షణ తరగతులు సంప్రదా యం కూచిపూడి గురుకులం, కల్లేపల్లిలో జరుగుతాయని డైరెక్టర్ స్వాతీసోమనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. కూచిపూడి నృత్యం, కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంత విద్యార్థులకు భోజనం, వసతి, బస్సు సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం 9440681083, 7731909837 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హోమం.. ఆవాహనం

- మజ్జిగౌరి సన్నిధిలో కొనసాగుతున్న చైత్రోత్సవాలు
- ప్రారంభమైన చండీహోమం



పురవీధుల్లో ఘటాల ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి అమ్మవారి సన్నిధిలో చండీహోమం సోమవారం ప్రారంభించారు. ఇందులో మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడ్డిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, పాలకొండ ప్రకాష్, వడ్డాది శ్రీనివాసరావు, పెద్దిన వాసు దంపతులు పాల్గొన్నారు. ఏటా అత్యంత నియమనిష్టలతో కొనసాగే ఈ హోమాన్ని గంజాం జిల్లా సొరడ ప్రాంతానికి చెందిన వేద పండితులు నీలమాధవ త్రిపాఠి ఆధ్వర్యంలో బాసుదేవ మహాపాత్రొ, జగన్నాథ దాస్, సరోజ్‌కుమార్ దాస్, ఇస్మాన్ రథొ, శక్తిప్రసాద్ దాస్, ప్రతాప్ దాస్, మందిర రాజ పురోహితులు బీరంచి దాస్ బృందం నిర్వహిస్తోంది. హోమం ఉత్సవాలు ఆఖరి వరకు కొనసాగుతాయి. ఆఖరి రోజున పూర్ణాహుతితో ముగుస్తాయి. ఈ నేపథ్యంలో ఆఖరిరోజు బుధవారం సాయంత్రం మందిర ప్రాంగణంలో మల్లెలు(నిప్పులు) తొక్కే కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు.

ఘటాల ఊరేగింపు..

చైత్రోత్సవాల సందర్భంగా అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలు ఆదివారం సాయంత్రం నుంచి పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. రోజూ సాయంత్రం ఈ ఊరేగింపు కొనసాగుతోంది. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఘటాలు ఊరేగింపు సమయంలో పురవాసులు అంతా శుభిక్షంగా ఉండాలని మొక్కుంటారు. ఆదేవిధంగా ముందుగా ఉండే పాలజంగిడిలో బియ్యం చిల్లర డబ్బులు వేస్తారు. ఈ సాంప్రదాయం నిత్యం కొనసాగుతోంది.

పూలతో అలంకరణ..

ఈ ఉత్సవాలు సందర్భంగా అమ్మవారు సునాబేసోతో పాటు పూల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో అలంకరణతో దర్శనం ఇస్తుండగా.. సోమవారం ప్రత్యేకంగా పండ్ల అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాలు 5రోజులు అమ్మవారి సన్నిధిలో నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



చండీహోమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు



అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

- జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక తదితరులు

మెళియాపుట్టి: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. పెద్దమడి కళాశాల మైదానంలో ఎస్పీ కప్ పేరిట వారం రోజులు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామీణ యువతను చైతన్య పరచడానికే ఇటువంటి టోర్నమెంట్లను నిర్వహిస్తున్నామన్నారు. యువకుల్లో క్రీడాస్ఫూర్తి పెరగాలన్నారు. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారు. క్రికెట్‌లో విన్నర్‌గా పాతపట్నానికి చెందిన లోకల్ బాయ్స్ జట్టు, రన్నర్‌గా ఆదివాసీ టీం నిలిచాయి. వాలీబాల్‌లో విన్నర్‌గా లేజీ హెడ్స్, రన్నర్‌గా టీం బాయ్స్, కబడ్డీలో మెళియపుట్టి జట్టు నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఏస్పీ వితలేశ్వరరావు, డీఎస్పీ శివారెడ్డి, పలాస, పాతపట్నం సీఐలు శ్రీనివాసరావు, వినోద్‌బాబు, ఎస్సైలు రాజేష్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమం బయటపడుతుందనే యువకుడ్ని చంపేశారు

- హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అక్రమ మైనింగ్‌పై సీఐడీ దర్యాప్తు చేయిస్తాం
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అక్రమ మైనింగ్ బయటపడుతోందనే ఉద్దేశంతోనే పొందూరు మండలం వీఆర్ గూడెంకి చెందిన గణేష్ గాయత్రి స్టోన్‌క్రషర్‌లో పనిచేస్తున్న 20 ఏళ్ల యువకుడు బగాది మణికంఠను గతనెల 30వ తేదీన చంపేసి సంబంధిత యజమానులు ప్రమాదంగా చిత్రీకరించారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రప్రధానకార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ (నాని) అన్నారు. మణికంఠను చంపేసిన హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేనంబర్ 137లో కొండపోరంబోకులో 400 ఎకరాల్లో మూడేళ్లుగా అక్రమ మైనింగ్ జరుగుతున్నా మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కొండ చుట్టూ వెంకటదుర్గ, గణేష్‌గాయత్రి, శ్రీనివాస స్టోన్‌క్రషర్లు ఉన్నాయన్నారు. అయితే గణేష్ గాయత్రి స్టోన్‌క్రషర్‌ను తెలుగుదేశం పార్టీకి చెందిన కూన రవికుమార్, కూన ప్రమీల, కూన రాజేష్, చింతాడ వాసు, చింతాడ సింహాచలం, చోళ్ల విశ్వేశ్వరరావు, చోళ్ల చిన్నప్పడు, చోళ్ల శ్రీను పేరిట నడిపిస్తున్నారన్నారు. ఇందులో పనిచేస్తున్న మణికంఠకు అక్రమమైనింగ్ విషయం తెలియడంతో ఎక్కడ బయట పెట్టేస్తాడోనన్న అనుమానంతో హత్యచేసి మృతదేహాన్ని రోడ్డుపై పడేసి ప్రమాదంగా చూపించడం దారుణమన్నారు. మార్చి 30వ తేదీన హత్య జరగ్గా.. అక్రమమైనింగ్ అని తెలియడంతో సంబంధిత అధికారులు ఏప్రిల్ ఒకటో తేదీన తనిఖీలు చేపట్టి 11 క్యూబిక్ మీటర్లు తవ్వారని నోటీసులు ఇస్తామని, జరిమానా వేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అక్కడ 15 నుంచి 20 ఎకరాల్లో గ్రావెల్ తవ్వుకుంటూ పోతే చట్టపరమైన చర్యలు తీసుకోకపోకపోవడం దారుణమన్నారు. క్రషర్ నిర్వాహకుల సమక్షంలో యువకుడి మృతదేహానికి పంచనామ నిర్వహించడం తగదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యత గల వ్యక్తిగా ఉన్న కూన రవికుమార్ అండ్ కో ఇలాంటి అక్రమాలకు పాల్పడితే చూస్తు ఊరుకోమన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని.. ఘటనపై సీఐడీ దర్యాప్తు చేయిస్తామన్నారు. నీతిమాలిన, హత్యారాజకీయాలు చేసి మనుగడ సాగించుకుంటామంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో పనికిరాదన్నారు. ఈ నెల 5వ తేదీన స్పీకర్ తమ్మినేని సీతారాం అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తారని..అలాగే యువకుడి హత్యకు కారణాలు తెలుసుకుంటారని వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, పొందూరు మార్కెట్‌కమిటీ చైర్మన్ బాడాన సునీల్, మండలపార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్, కనపల తేజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

8 తులాల బంగారం చోరీ



స్థానికులను విచారణ చేస్తున్న సీఐ అప్పలనాయుడు

మెంటాడ: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో గురువారం రాత్రి ఎనిమిది తులాల బంగారం చోరీకి గురైందని స్థానికురాలు నగరి సన్యాసమ్మ ఫిర్యాదు చేసినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం రాత్రి గజపతినగరంలోని తన అల్లుడు మక్కువ సత్యంనాయుడు నూడిల్స్ షాపు ప్రారంభానికి ఇంట్లో అందరం వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చే చూసేసరికి బెడ్‌రూం తలుపులు తీసేసి బీరువా తాళం పగులగొట్టి బట్టలు చిందరవందర చేసేసి ఎనిమిది తులాల బంగారం చోరీకి గురైంది. ఈ మేరకు బాధితురాలు సన్యాసమ్మ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడు ఆధ్వర్యంలో క్లూస్‌టీం దర్యాప్తు చేసిందని నిందితుల కోసం గాలింపు చేపడతామని తెలిపారు.

బాలుర పరిశీలన గృహం సందర్శన



బాలుర పరిశీలన గృహాన్ని పరిశీలిస్తున్న ఆర్.జె .ఆనంద్

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని దిశ వన్‌స్టాప్ సెంటర్, కొత్త ధర్మపురిలోని బాలుర పరిశీలన గృహాన్ని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఆర్.జె .ఆనంద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలుర పరిశీలన గృహంలో సౌకర్యాల గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించి ఏరకమైన కేసులు వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి, బి.శాంతకుమారి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి, డీసీపీయూ అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

- విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 40 ఫిర్యాదులను దిశ డీఎస్పీ ఎం.వెంకటేశర్లుతో కలిసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై ఏడు పనిదినాల్లో సమస్యలను పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అలాగే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎస్పీ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కర్బూజా తోటలో ఘీం'కరి'ంపు

- లబోదిబోమంటున్న రైతులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం-బిత్రపాడు పరిసర పంటపొలాల్లో ఉన్న కర్బూజా తోటలో మూడురోజుల నుంచి ఏనుగులు తిష్ట వేశాయి. సోమవారం ఉదయం రైతులు పంట పొలాలకు వెళ్లి చూసేసరికి కర్బూజా కాయలు ధ్వంసం కావడంతో రైతులు లబోదిబోమమంటున్నారు. అటవీ శాఖాధికారులు ఏనుగులను చూడడమే తప్ప తరలించే ప్రయత్నం చేయక పోవడంతో వారంతా అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత లధికారులు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెరుగుతున్న గజరాజుల విధ్వంసం

భామిని: మండలంలో రెండు ఏనుగుల గుంపు సంచారంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం రెండు ఏనుగుల గుంపులు పంట పొలాల్లోకి దిగి కొంత మేరకు తినివేసి, మరికొంత పంటను ధ్వంసం చేసి వెళ్లాయని రైతులు వాపోతున్నారు. తాలాడ ఐలమ్మ తోట లోగల 4 ఏనుగుల గుంపు, పక్కుడుభద్ర జీడితోటలో తిష్ఠ వేసిన 6 ఏనుగుల గుంపు విధ్వంసంతో పంట నష్టాలు పెరుగుతున్నాయి. పక్కుడుభద్ర వద్ద తిష్ఠ వేసిన ఏనుగుల గుంపును కొందరు రైతులు రాత్రి పూట తరలించడానికి చేసిన ప్రయత్నాలు మిగతా రైతులకు కష్టాలు తెచ్చాయి. వంశధార వరద గట్టు మీదుగా కాత్రగడ రైతులు ఏనుగులను తరలించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నేరడి, గురండి, బిల్లుమడ గ్రామాల వరకు చేరుకున్న ఏనుగులు ఆకస్మికంగా వెనుదిరిగాయి. నేరడి, గురండి రైతులకు చెందిన పంటలను తినివేస్తూ వెనుదిరిగాయి.

ప్రగతిపథంలో
పార్వతీపురం మన్యం

జిల్లాల పునర్విభజనలో భాగంగా నాలుగు నియోజకవర్గాలు.. 15 మండలాలు.. 2,729.64 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం.. 9,25,340 లక్షల జనాభాతో ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోంది. సగానికి పైబడి గిరిజన జనాభాతో కూడిన జిల్లా అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. అధికారులు, పాలకుల సమష్టికృషి ఫలిస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. విద్య, వైద్యం, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో స్పష్టమైన ప్రగతి కనిపిస్తోంది.

- అందుబాటులోకి ప్రభుత్వ సేవలు
- చేరువైన వైద్యం
- ప్రజలకు దగ్గరైన జిల్లా కేంద్రం
- అందుబాటులో అధికారులు, పాలకులు

పార్వతీపురంటౌన్: జిల్లాల పునర్విభజన జరిగి మంగళవారానికి (ఏప్రిల్ 4, 2022) ఏడాది పూర్తవుతుంది. ప్రజలకు పాలన చేరువచేయడం, అధికారుల పర్యవేక్షణ, జవాబుదారీతనం పెంచడం, వనరుల సద్వినియోగం, పారదర్శక పాలనే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లోక్‌సభ నియోజక వర్గాలవారీగా జిల్లాలను పునర్విభజన చేసింది. దీనిలో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాలతో కలిపి కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించింది. నాలుగు నియోజకవర్గాలు, 15 మండలాలతో ఏర్పడిన జిల్లాకు కలెక్టర్‌గా నిషాంత్‌కుమార్, జేసీగా ఒ.ఆనంద్, ఎస్పీగా విద్యాసాగర్‌నాయుడు బాధ్యతలు చేపట్టి ఏడాదిగా జిల్లా అభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేల సూచనలకు అనుగుణంగా జిల్లాను ప్రగతిపట్టాలపై నడిపిస్తున్నారు. గిరిజనుల ఆర్థిక సంక్షేమానికి బాటలు వేస్తున్నారు. పార్వతీపురం, సాలూరు మున్సిపాల్టీ, పాలకొండ నగర పంచాయతీతో పాటు రెండు ఐటీడీఏల పరిధిలోని ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారు. జిల్లా పరిధి చిన్నదిగా ఉండడంతో నిరంతరం పర్యటిస్తున్నారు.

అన్నింటా ముందంజ..

జిల్లా చిన్నదిగా ఉండడంతో ప్రతి గ్రామంపైనా అధికారులకు స్పష్టమైన అవగాహన ఉంది. సహజ వనరులు సద్వినియోగమయ్యేలే చక్కని ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారు. గిరిజన ప్రజలకు విద్య, వైద్యం చేరువ చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.600 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. మరో రూ.49.70కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. రూ.వెయ్యికోట్ల వ్యయంతో గిరిశిఖర గ్రామాలకు రోడ్లువేసే ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే కొన్నిరోడ్ల పనులు చకచకా సాగుతున్నాయి. మరికొన్ని పూర్తయ్యాయి. ఉపాధిహామీ పనుల కల్పన, ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా ముందంజలో ఉంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 24,743 ఇళ్లకు 9,070 ఇళ్లనిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.



పార్వతీపురం మన్యం జిల్లా మ్యాప్

సిగ్నల్ సమస్యలకు చెక్

సచివాలయ వ్యవస్థతో ఊరికో సచివాలయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తోంది. ఇందులో భాగంగా కొండశిఖర గ్రామాల్లోనూ సిగ్నల్ సమస్యలు లేకుండా సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, ఐడియా, జియో సంస్థలు సెల్ టవర్ల ఏర్పాటులో నిమగ్నమయ్యాయి.

– నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకు మన్యం జిల్లా పేరు. ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి మార్కెట్ చేసేందుకు జిల్లా యంత్రాంగం నడుంబిగించింది. వన్‌ధన్ వికాస కేంద్రాలను ప్రోత్సహిస్తోంది. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో పామాయిల్ కంపెనీలు వెలిశాయి.

త్వరితగతిన పరిష్కారం



ప్రజలకు పరిపాలన మరింత చేరువయ్యేలా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నూతన జిల్లాలు ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు చేరువయ్యాయి. సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోంది. జిల్లాకు రూ.600కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, 49.5 కోట్లతో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టి ప్రజలకు వైద్యాన్ని చేరువచేశారు.

– అలజంగి జోగారావు, ఎమ్మెల్యే, పార్వతీపురం

అభివృద్ధికి నాంది



పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం నాంది పలికింది. ఏడాది కాలంలో వివిధ పథకాల కింద నిధులు సమకూర్చడంతో అభివృద్ధిపనులు వేగవంతమయ్యాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధిహామీ రంగాలను తీర్చిదిద్దేక్రమంలో సీఎం అండ ఉంది. అన్ని వర్గాలను కలుపుకుంటూ మరింత అభివృద్ధికి కృషిచేస్తున్నాం.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, పాలకొండ

పాలన మరింత చేరువ...



కొత్త జిల్లాతో పాలన చేరువైంది. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ఊరిలోనే అందుతున్నాయి. ప్రజలకు వ్యయప్రయాసలు తప్పాయి. అధికారులు, పాలకుల పర్యవేక్షణ సులభమైంది. ప్రతి పైసా సద్వినియోగమవుతోంది. గిరిజన ప్రజలకు అధిక లబ్ధిచేకూరుతోంది. కురుపాం నియోజకవర్గంలో రూ.900 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాం. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో 105 ఎకరాల విస్తీర్ణంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్త జిల్లాలో రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం.

– పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే, కురుపాం

దూరం తగ్గింది



కొత్త జిల్లాతో ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. జిల్లా కేంద్రం చేరువైంది. గతంలో స్పందన కార్యక్రమానికి విజయనగరం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు దగ్గరలో ఉన్న పార్వతీపురం కలెక్టరేట్‌కు వెళ్లి సమస్యలు విన్నవించుకునే అవకాశం లభించింది. అధికారులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గిరిజన ప్రాంతాల ప్రగతికి శ్రద్ధచూపుతున్నారు. ప్రజలకు సుపరిపాలన చేరువైంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సాలూరు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. జిల్లాలోని ఒక మెడికల్ కళాశాల, రెండు మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంక్షేమ పాలనపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నాం.

– పీడిక రాజన్నదొర, గిరిజన శాఖామంత్రి, ఉప ముఖ్యమంత్రి

మత్తుపదార్థాల రవాణాపై నిఘా



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో మత్తు, మాదక ద్రవ్యాలపై పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ఆదిలోనే అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల నివారణకు చెక్‌పోస్టు వద్ద నిఘా ఉండాలన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ గిరిజన, గిరిశిఖర ప్రాంతాల్లో గంజాయి సాగుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎక్కడ గంజాయి పంట సాగుచేసినా పోలీసులకు సమాచారం అందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్ కిరణ్, డీఎఫ్ఓ ప్రసూన, ఆర్డీఓ హేమలత, డీఎంఅండ్‌హెచ్ఓ జగన్నాథరావు, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి లావణ్య, గిరిజన సంక్షేమ శాఖాధికారి పి.సూర్యనారాయణ, విద్యాశాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రమదానం

పార్వతీపురం మన్యం జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పెద్ద ఎత్తున శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం పట్టణానికి జిల్లా కేంద్రానికి ఉండాల్సిన హంగులన్నీ ఉండాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయం ఆవరణ, పరిసర ప్రాంతాల్లో శ్రమదానం జరుగుతుందన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఉద్యోగులను బృందాలుగా విభజించి ఒక్కో బృందానికి ఒక్కో ప్రాంతాన్ని అప్పగిస్తామని వివరించారు. బాగా పనిచేసిన బృందానికి బహుమతులు అందించే యోచనలో ఉన్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతీవారం శ్రమదానం చేసి కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. ఈ నెల 5న కలెక్టర్ కార్యాలయ ప్రహరీ, గేట్‌లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్ మృతి



లారీలో ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రామభద్రపురం: మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద సోమవారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏటకన్నరెడ్డి కాలనీకి చెందిన గొగ్గులోతు రాము అలియాస్ రాములా నాయక్ (53) అదే జిల్లాలోని మటంపల్లి నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడుతో సాలూరు పట్టణానికి వస్తున్నాడు.సరిగ్గా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ముందు ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టడంతో డ్రైవర్ రాము ముందుకు తూలిపోయి స్టీరింగ్, బాయినెట్ మధ్య ఇరుక్కుపోయి అక్కడిక్కడే మృతిచెందాడు. స్టీరింగ్‌కు బాయినెట్ మధ్య ఇరుక్కున్న మృతదేహాన్ని జేసీబీ సహాయంతో అతి కష్టంమీద తీయాల్సి వచ్చింది. అలాగే ముందున్న లారీ బాయినెట్ కూడా పూర్తిగా పాడైపోయి ఉంది. ఆ లారీ ముందు కూడా గుర్తు తెలియని వాహనం ఉంది. ఆ లారీ డ్రైవర్ పరారవడంతో పూర్తి సమాచారం తెలియరాలేదు. పరారైన లారీ డ్రైవర్ పట్టుబడితే గాని అసలు విషయం తెలియరాదని పోలీసులు చెబుతున్నారు. ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..



ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వాసవి కల్యాణ మంటపం సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జి.శిరీష సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు గమనించి 108కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. వీర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9121109431, 9121109463 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాలల సంక్షేమానికి ప్రభుత్వ పథకాల అమలు

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్‌లో బాలల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆర్.జె. ఆనంద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోది ఆలోచనలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సహకారం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. డ్రగ్స్ బారిన పడి పిల్లలు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, డీఆర్వో గణపతిరావు, డీసీపీయూ అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎండన పడకుండా జాగ్రత్త..!

- ఒంటిపూట స్కూల్స్ వేళ బహుపరాక్
- పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్న వైద్యులు



ఒంటిపూట బడి కావడంతో విద్యార్థుల హడావిడి



వాహనాలపై విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

విజయనగరం: వేసవి దృష్ట్యా..పాఠశాలలకు ఒంటిపూట తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం సెలవులు కావడంతో పిల్లలు ఆటలాడేందుకు బయటకు వెళ్తుంటారు. ఒక్కోసారి ఆనందం వెంటే విషాదాలు పొంచి ఉంటాయని తల్లిదండ్రులు గ్రహించాలి. ఒంటిపూట బడుల సమయంలో పాఠశాలకు వెళ్లే పిల్లలు సరదాలకు అలవాటు పడతారు. తల్లిదండ్రులు ఎంత వారించినా ఇంటిపట్టున ఉండేందుకు సుముఖత చూపరు. ఇంట్లో చెప్పకుండా సరదా కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువ. మరోవైపు వేసవి కావడంతో ఎండలో తిరగడం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదముంది. ఒంటిపూట బడులు పిల్లల ఆరోగ్య రీత్యా విద్యాశాఖ ఇచ్చిన వెసులుబాటు అని తల్లిదండ్రులు గ్రహించాలని వైద్యులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్న సలహాలు ఇలా ఉన్నాయి.

గుండె చెరువు కాకుండా..ఉండాలంటే..

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, బావుల్లో పెద్దలు లేకుండా ఈతకు వెళ్లనీయదు.
- ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై మోజుతో ఇంట్లో చెప్పాపెట్టకుండా రోడ్డెక్కితే ప్రమాదాల బారిన పడే ఆస్కారముంది.
- బడి వదలగానే కొందరు పిల్లలు సమయం దొరికిందని ఎండలో ఆటలాడుతారు. ఫలితంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది.
- పాఠశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చాక చిన్నారులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. నీతి కథలు, స్ఫూర్తిగాథలు చదివే విధంగా ప్రోత్సహించాలి. తద్వారా చిన్నారులు ఇంటి పట్టున ఉండే అవకాశం ఉంది. అవసరమైతే నీడ పట్టున ఆడుకునే ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలనే చెప్పాలి. చదరంగం, క్యారమ్స్ వంటి ఆటల్లో ప్రోత్సహించాలి.

వడదెబ్బ నుంచి బయటపడటం ఇలా..

వేసవిలో శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నప్పుడు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. దీంతో భౌతికంగానే కాకుండా శరీరంలో వివిధ అవయవాలు, నాడీ వ్యవస్థ ప్రమాదానికి గురై ఒక్కోసారి పిల్లలు, పెద్దలలోనూ గుండెపోటు వచ్చే ప్రమాదముంది. ఇలాంటి సమయంలో వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎక్కువ ఉష్ణోగ్రత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలలో నీరు తాగితే మూత్రవిసర్జన చేయాల్సి వస్తుందని పిల్లలు నీరు తాగరు. దీని వల్ల డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదముంది. వేసవిలో రోజూ కనీసం 8 గ్లాసుల నీరు తాగేలా చూడాలి.

పాఠశాలకు వెళ్లే, వచ్చే ముందు..

- ఉదయం 8 గంటలలోగా పిల్లలకు స్నానం చేయించాలి. పల్చని దుస్తులు వేయాలి.
- పాఠశాలకు వెళ్లే సమయంలో కళ్లద్దాలు, సన్‌స్క్రీన్ లోషన్లు వాడాలి. పిల్లల సంచిలో నీళ్ల సీసా ఉండేలా చూడాలి.
- పాఠశాల నుంచి బయటకు వచ్చే సమయంలో ఎండ తగలకుండా గొడుగు, తలకు టోపీ, క్లాత్ ఏదో ఒకటి కప్పి తీసుకురావాలి. లేదంటే పిల్లలు నీరసించిపోతారు దీంతో తలనొప్పి రావచ్చు.
- ఆరేళ్లలోపు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత పెరిగిన వెంటనే వారికి ఫిట్స్ వచ్చే ప్రమాదం ఎక్కువ.
- ఎండలో నుంచి ఇంటికి రాగానే ఫ్రిజ్‌లోని చల్లని నీరు, శీతల పానీయాలు తాగొద్దు. మట్టితో తయారుచేసిన కుండలోని చల్లటి నీటిని మాత్రమే తాగాలి.
- పుచ్చకాయలు తినిపించడం, పండ్ల రసాలు, కొబ్బరిబొండాలు తాగించాలి. కీరదోస, క్యారట్, బీట్‌రూట్ లాంటి పచ్చి కూరగాయలను తినిపించాలి.

కలుషిత నీరు తాగొద్దు

కలుషిత నీరు తాగితే జీర్ణకోశ సమస్యలు వచ్చే ప్రమాదముంది. కడుపునొప్పి, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. కలుషితమైన, శుభ్రతలేని ఆహారం తీసుకోవడం వల్ల హానికరమైన సూక్ష్మజీవుల కారణంగా పిల్లల్లో ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదముంటుంది.

వేసవిలో వచ్చే ఇన్ఫెక్షన్లు

- చమట వల్ల ఎగ్జిమా, దురద, సెగగడ్డలు వంటి అనేక చర్మ సమస్యలు తలెత్తి జ్వరాలు రావొచ్చు. పిల్లలకు చమట ఎక్కువగా పట్టినప్పుడు శుభ్రమైన గుడ్డతో తుడిచి తేలికపాటి దుస్తులు వేయాలి.
- వేడిమి వల్ల ఒక్కోసారి ముక్కు నుంచి రక్తం కారుతుంది. ముక్కులో వేలుపెట్టే అలవాటు ఉంటే ఎక్కువ ప్రమాదం.
- పిల్లల్లో ఈ కాలంలో కళ్లకలక వ్యాపిస్తుంది. దుమ్ముధూళి, వేడి వల్ల కంటి ఇన్ఫెక్షన్లు త్వరగా వస్తాయి.

పిల్లలను బయలకు వంపొద్దు

ఒంటిపూట బడి వదలగానే మధ్యాహ్నం వేళ పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపొద్దు. ఈ సమయంలో వీలును బట్టి తల్లిదండ్రులు పిల్లలతో గడిపేందుకు అధిక సమయం కేటాయించాలి. ఇంటి పట్టున ఉండేలా పిల్లలకు వారి హోంవర్క్‌లో సాయం చేస్తూ వారిని ప్రోత్సహించాలి.

– కె.శ్రీనివాసరావు, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, సీహెచ్‌సీ, నెల్లిమర్ల

ఫైబర్ బోటు దగ్ధం

- సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం



కాలిపోయిన బోటును పరిశీలిస్తున్న మత్స్య, రెవెన్యూ శాఖ అధికారులు

భోగాపురం: మండలంలోని చోడిపిండిపేట గ్రామ సమీప సముద్ర తీరంలో లంగరు వేసిన ఫైబర్ ఇంజిన్ బోటు ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. దీనిపై మత్స్యశాఖ, రెవెన్యూ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరుపల్లి పోలేష్ తనకున్న ఫైబర్ బోటుతో ప్రతిరోజూ సముద్రంలో చేపలవేట సాగిస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలోకి వేటకు వెళ్లాడు. మళ్లీ వేట ముగించుకుని సాయంత్రం 4 గంటలకు బోటును సముద్రంలో లంగరు వేసి తోటి మత్స్యకారులతో కలిసి ఇంటికి చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో సముద్రంలో లంగరు వేసిన బోటు నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు బోటు యాజమాని పోలేష్‌కు సమాచారం అందిండంతో తోటి మత్స్యకారులను తీసుకుని సముద్రంలోకి వెళ్లి మంటలను అదుపుచేసి కాలిపోయిన బోటును ఒడ్డుకు చేర్చారు.

రూ.20 లక్షల ఆస్తి నష్టం

విషయం తెలుసుకున్న మత్స్యశాఖ ఎఫ్‌డీఓ చాందిని, వీఆర్ఓ లక్ష్మి, రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ డెరెక్టర్ నరసింహులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన బోటుతో పాటు వలల విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. బాధితుడు పోలేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.